క్లుప్తంగా

జూన్ 11న మోడల్ స్కూల్ ఎంట్రన్స్

పుంగనూరు: మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం జూన్ 11న పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ రమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఎటువంటి ఫీజులు లేకుండా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు స్కూల్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

శాంతిపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎండీకేవీ లత తెలిపారు. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్లు పాటిస్తూ సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

గుడుపల్లె: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 9 నుంచి 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భువనేశ్వరి శుక్రవారం తెలిపారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

8న మెగా జాబ్ మేళా

కుప్పం: పట్టణంలోని ఐఆర్ఎం విద్యా సంస్థల్లో ఈనెల 8వ తేదీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. మహేంద్ర, అమేజాన్ , బైజీస్, క్వీస్ తదితర పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లొమో, పీజీ కోర్సులు చేసిన అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9989388220, 9989388330, 9949150153 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



గుడుపల్లె: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ ఎస్ ప్యాకెట్లను అందించారు. శుక్రవారం మండలంలోని శెట్టిపల్లె, కంచిబందార్లపల్లె , కనమనపల్లెలో ఉపాధి పనులను ఎంపీడీఓ రమణ పరిశీలించారు. గిట్టుబాటు అవుతుందా అని కూలీలను అడిగారు. అనంతరం కనమనపల్లె, కంచిబందార్లపల్లె సచివాలయాలను తనిఖీలు నిర్వహించారు. తర్వాత శెట్టిపల్లె గ్రామం వద్ద పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను 40 మంది అందించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పిస్తాం

పలమనేరు: ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పిస్తామని మానవహక్కుల సంఘ సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్‌ను జిల్లా కోర్టులోని లీగల్ సర్వీసెస్ అథారిటీతో కలిసి ఈమేరకు తెలిపినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు మాదేష్ తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తామని వివరించినట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు శివశంకర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో మోస్తరు వర్షం



పలమనేరు: పలమనేరు పట్టణంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న జనానికి ఈ వర్షంతో ఉపశమనం లభించింది. వాతావరణం సైతం చల్లబడింది. పట్టణంలోని లోతట్టుప్రాంతాలైన ఆర్టీసి బస్టాండు, రాధాబంగ్లా, చెరువు, టమాట మార్కెట్ తదితర ప్రాంతాలు చిత్తడిమయం అయ్యాయి. వేసవిదుక్కులకు ఈవర్షం అనుకూలంగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎటువంటి నష్టం జరగలేదు. ఇలాగే మరో రెండు రోజులు వర్షం పడితే అన్ని పంటలకు మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు.

చల్లబడిన చిత్తూరు..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్రవారం కూడా మోస్తరు వాన కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో మొదలైన చిరు జల్లులు భారీ వర్షంగా మారింది. సాయంత్రం 5.30 గంటల వరకు కురిసిన ఈ వర్షంతో చిత్తూరులోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

విద్యాకానుక కిట్లు వచ్చేశాయ్

ఐరాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ చేసేందుకు విద్యాకానుక కిట్లు వచ్చినట్లు ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 3,810 మంది విద్యార్థులకు యూనిఫాం వచ్చిందన్నారు. వీటిని రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల వారీగా విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం కుప్పం మండల పరిధిలోని ఉర్లవోబనపల్లె, గట్టప్పనాయునిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 362 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రోడ్లు, పెన్షన్, అమ్మ ఒడి, వాటర్ ట్యాంకు, రైతు భరోసా, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పక్ష నాయకుడి నియోజకవర్గమైనా పథకాల పంపిణీలో ఎలాంటి వివక్ష లేకుండా లబ్ధి అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వృద్ధులు పెన్షన్ కావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో అర్హులైతే చాలు 1వ తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పంలో గత ప్రభుత్వ హయాంలో 680 గృహాలు ఇస్తే, తమ హయాంలో 4 వేలు పైచిలుకు ఇండ్లు ఇచ్చి, పేదల సొంతింటి కల నెరవేర్చామని చెప్పారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మరిన్ని పథకాలు అందాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని కోరారు.

సచివాలయం తనిఖీ...

కార్యక్రమంలో భాగంగా ఉర్లవోబనపల్లె గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్సీ భరత్ తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ, వివిధ సమస్యల నిమిత్తం సచివాలయానికి వచ్చే లబ్ధిదారుల పట్ల మర్యాదగా మెలగాలని, సమస్యలను ఓపిగ్గా విని పరిష్కరించాలని సూచించారు. మీ పరిధిలోనిది కాకపోతే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వలంటీర్లు తమ పరిధిలోని ఇండ్లలో ఏ సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, నాయకులు మురుగేష్, కుట్టి, అబ్బు, రమేష్, చీలేపల్లి రవి, గణపతి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సదుం: మోటార్లను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జలకళ పథకం లబ్ధిదారులకు బోరు మోటార్లు, కేబుళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలతో ప్రభుత్వం అండగా ఉంటోందని చెప్పారు. ఏపీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో జలకళలో 24 మంది రైతులకు ఇప్పటికే ఉచిత బోర్లు డ్రిల్ చేశామని, అందులో మొదటి విడతగా ఆరుగురికి మోటర్లు మంజూరు అయినట్లు చెప్పారు. ఎంపీపీ ఎల్లప్ప, ఏపీఓ శివశంకర్, సర్పంచ్‌లు శ్రీనివాసులరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఇలావంతుని బలి



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లె శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇలావంతుని బలి కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఆలయం సమీపంలో ఇలావంతుని ప్రతిమను ప్రత్యేక అలంకరించారు. ఇలావంతుని బలి ఘట్టాన్ని చేపట్టారు. ఇలావంతుని ప్రతిమను బలి చేసి ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం చుట్టు ఊరేగించారు. శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన జరిగింది. శనివారం దుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థిక సాయం



సోమల: నగదు అందజేస్తున్న నాయకులు

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతల వారిపల్లెకు చెందిన గంగాధర రెడ్డి కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం చేశారు. గంగాధరరెడ్డి కుమారుడు నవీన్ కుమార్‌రెడ్డి ఆరు రోజుల కిందట మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రి అందజేసిన రూ.లక్షను బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, వైస్ ఎంపీపీ ప్రభాకర, నాగభూషణంరెడ్డి, సాంబయ్య, వరదం రమణ, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు హామీ



సదుం: సమావేశంలో పాల్గొన్న నాయకులు

సదుం: మండల కేంద్రంలో భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తమ సొంత నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు కురవ సంఘం నాయకులు తెలిపారు. మండల కురబ సంఘం సమావేశం సుబ్రమణ్యస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈనెల 21న భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వారు చెప్పారు. మండలంలో సమారు 12 వేల ఓట్లు ఉండడంతో కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, శ్రీనివాసులు, వాసు, నారాయణబాబు, వెంకటరమణ, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలలో కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: వివిధ ప్రభుత్వ సర్వేలలో మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న ఎస్‌డీజీ, ఆయుష్మాన్ భారత్ తదితర సర్వేలు పూర్తి కావాలంటే మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలక భూమిక పోషించాలన్నారు. జిల్లాలో పెద్దపంజాణి మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో టార్గెట్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. విస్తరణ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అర్ధగిరిలో సుదర్శన హోమం



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి అశేషంగా విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించి తరించారు. ఆలయ ఆవరణలో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణా హుతి అనంతరం ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. తొలుత శ్రీవీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తికి అభిషేక పూజలు, అలంకరణలు చేసి పల్లకిలో కొలువుదీర్చారు. అర్చకులు, భక్తులు జోలపాటలు పాడుతూ ప్రదక్షిణ చేశారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, చెక్కల భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

వరదరాజస్వామి ఆలయంలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అనుబంధ శ్రీశ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో చిత్ర పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీ సిద్ధి,బుద్ధి సమేత వినాయకస్వామి, శ్రీశ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ వెంకటేశు, అధికారులు శ్రీధర్ బాబు, కోదండపాణి, బాలాజీ నాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు.



అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో రద్దీ



వరదరాజస్వామి ఆలయంలో పూజలు

వంట గ్యాస్ ధర తగ్గించాలని 8న ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: రాజస్థాన్‌లో ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తక్కువ ధరకు వంటగ్యాస్‌ను ఇవ్వాలని మహిళ సమైక్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. మోదీ పాలనలో ధరలు పెంచడమే పనిగా మారిందని విమర్శించారు. బడాబాబులకు ప్రభుత్వ ఆస్తులను విక్రయించడం, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే బీజేపీగా పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. వంటగ్యాస్ ధరను తగ్గించాలని ఈనెల 8న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కుమారి, రమాదేవి, రాజేశ్వరి, డీహెచ్‌పీఎస్ నాయకులకు రఘు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాయావతి స్పందించాలి

చిత్తూరు రూరల్: ఎస్సీ వర్గీకరణపై చట్టబద్ధతకు బీఎస్పీ అధినేత మాయవతి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో ఏళ్లుగా పోరాడుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని చెప్పారు. ఈనెల 7న బీఎస్పీ అధినేత మాయవతి హైదరాబాద్‌కు వస్తున్నారని..ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం సానుకూలమైన ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రామక్రిష్ణ, ప్రకాష్, రెడ్డెప్ప, గోపాల్, ఉమాపతి, హేమాద్రి, రాజేష్ తదితరులు ఉన్నారు.

నేత్రపర్వం.. శ్రీరాముని రథోత్సవం



కుప్పం : రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



బైరెడ్డిపల్లె: రథం లాగుతున్న భక్తులు

కుప్పం : పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి సీత, లక్ష్మణ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, అశేష భక్తులు శ్రీరామ నామస్మరణల నడుమ పురవీధుల్లో రథోత్సవం జరిగింది. భక్తులు రథాన్ని లాగి తన్మయత్వం చెందారు. రెండేళ్ల తర్వాత ఉత్సవాలు జరుగుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

రథంపై కల్యాణ వెంకటరమణస్వామి

బైరెడ్డిపల్లె: బేలుపల్లె పంచాయతీ పట్నపల్లె సమీపంలోని శ్రీకల్యాణ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం వేడుకగా సాగింది. సుందరంగా అలంకరించిన బ్రహ్మరథంపై శ్రీశ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకట్రమణస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం గోవింద నామస్మరణల నడుమ రథోత్సవం వైభవంగా జరిగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు రథాన్ని లాగి పారవశ్యం చెందారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

రాయలవారి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న నేతలు నాగభూషణం, త్యాగరాజు

పుంగనూరు: విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్టకు బలిజ కులస్తులు శుక్రవారం భూమి పూజ చేశారు. సంఘ నాయకులు కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్ కుమార్ సహకారంతో భీమగానిపల్లె వద్ద విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించారని తెలిపారు. అలాగే మిథున్‌రెడ్డి సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు మంత్రి తగిన సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పూలత్యాగరాజు, నానబాలగణేష్, గోపి, కిషోర్, సుబ్బరాయప్ప, ముని, సోము, మనోహర్, సురేష్, మధు, శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

15లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పుంగనూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను ఈనెల 15లోపు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరితో కలసి గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాలనీలు సుందరంగా ఉండేలా చూడాలని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రతి రోజూ పర్యవేక్షించాలని సూచించారు. ఎవరు అలసత్వం వహించ కూడదని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈలు హేమంత్‌కుమార్, శేఖర్, ఐకేపీ ఏపీఎం రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

పెద్దపంజాణి: జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ వివరించారు. సీఈఓ మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాల టార్గెట్ పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

సంఘమిత్రపై పీడీకి ఫిర్యాదు

బైరెడ్డిపల్లె : తమను ధిక్కరించి నగదును డ్రా చేయడంపై మండలంలోని కుప్పనపల్లె సంఘమిత్ర మహాతులసిపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు శుక్రవారం ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహా తులసికి ఎస్‌హెచ్‌జీ గ్రూపు పేరుపై ఖాతా ఉందన్నారు. గ్రూపునకు సంబంధించి రూ.12 లక్షలు రుణం తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రూపులో 10 మంది సభ్యులు ఉండగా, సరస్వతి అనే సభ్యురాలికి 60 సంవత్సరాలు పైబడడంతో రుణం ఇవ్వకూడదని తీర్మానం చేశామన్నారు. ఈ విషయం బ్యాంకు మేనేజర్‌కు తెలియజేశామని పేర్కొన్నారు. అయితే గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా సంఘమిత్ర, బ్యాంకు మేనేజర్‌లు కలిసి సరస్వతికి రుణం మంజూరు చేసి నగదును అందజేశారని తెలిపారు. సరస్వతి నగదు చెల్లించకపోతే గ్రూపు సభ్యులది బాధ్యత కాదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వేడుకగా మొలకల పౌర్ణమి



ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



విశేషాలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

పులిచెర్ల(కల్లూరు): దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం మొలకల పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు అనంతాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో..

రామకుప్పం: మండలకేంద్రంలోని శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు జరిగాయి. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

పాతకురవపల్లెలో

రొంపిచెర్ల: మండలంలోని పాతకురవపల్లెలో మొలకల పౌర్ణమి పండుగను ప్రజలు శుక్రవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఏడు రోజుల కిందట మొలకలు పోసుకున్నారు. శుక్రవారం మొలకలతో ముత్యాలమ్మ, గంగమ్మ, ఈరబాలమ్మ, గౌరమ్మ ఆలయాల్లో నోము నోచుకున్నారు. సమాధుల వద్ద కూడా పూజలు చేశారు.



రొంపిచెర్ల : ముత్యాలమ్మ ఆలయంలో మహిళల పూజలు